క్లుప్తంగా

బొత్సకు వాసుపల్లి శుభాకాంక్షలు



బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ఇటీవల జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లాల స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీచ్‌రోడ్డులో గల ఆయన నివాసంలో బొత్సతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై వాసుపల్లి కాసేపు బొత్సతో ముచ్చటించారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీంగా గెలుపొందడంపై ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

13వ రోజుకు శ్రావణలక్ష్మీ పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్ : శ్రావణమాసం సందర్భంగా కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు శనివారం 13వ రోజుకి చేరాయి. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మీ దేవస్థానంలో శనివారం తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

వృద్ధుడికి ఆశ్రయం



షెల్టర్‌లో వృద్ధుడు సత్యనారాయణ

అల్లిపురం : భార్య చనిపోయిన తర్వాత ముగ్గురు కూతుళ్లున్నా పట్టించుకోకపోవటంతో ఒక తండ్రి రోడ్డున పడ్డాడు. బి.సత్యనారాయణ అనే 74 సంవత్సరాల వ్యక్తి నడవలేని స్థితిలో ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉండగా టూటౌన్ పోలీసులు అతన్ని గుర్తించి ఏయూ టీడీ, భీమ్‌నగర్ షెల్టర్‌కు తరలించడంతో అతనికి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు.

వైభవంగా సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం, శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన జరిగింది.

కనుల విందుగా.. మనసు నిండుగా..

- నియోజకవర్గ వాసులకు వీకెండ్ ధమాకా
- ప్రేమసమాజం ఆడిటోరియం.. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా..
- నెలలో 15 నుంచి 20 కార్యక్రమాల నిర్వహణ

> పండితులనైనా.. పామరులనైనా ఆకట్టుకునేవి కళలు. నాటి తోలు బొమ్మలాటల నుంచి.. నేటి డిజిటల్ ప్రపంచం వరకు మనిషికి మానసిక ఉల్లాసాన్నిస్తున్నాయి. నియోజకవర్గంలోని ప్రేమసమాజం అన్నపూర్ణ ఆడిటోరియం, డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ప్రతివారం శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న సంగీత, హాస్య, నాటక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నిత్య జీవనంలో ఒత్తిడికి లోనయ్యే ప్రజలకు మానసికోల్లాసం కలిగిస్తున్నాయి.



జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సినీ నటి వాణిశ్రీ (ఫైల్)

డాబాగార్డెన్స్: సంగీతం, నాటకం, నాటిక, నృత్యం వంటి కళా రూపాలన్నీ మనిషి ఆనందానికి.. ఉత్సాహానికి.. ఉల్లాసానికి చక్కటి టానిక్కులు. ఒత్తిడితో సతమతమవుతున్న మానవుడిని ముందుకు నడిపించేవి ఇవే. అటువంటి కార్యక్రమాలకు దక్షిణ నియోజకవర్గం వేదికగా నిలుస్తోంది. ఒక నాటిక.. ఒక నృత్యం.. సంగీత కార్యక్రమం.. హాస్యం పంచే కామెడీ స్కిట్.. వంటి ప్రదర్శనలను నెలలో 15 నుంచి 20 వరకు వివిధ సంస్థలు ప్రదర్శిస్తూ నియోజకవర్గ ప్రజలను ఉర్రూతలూగిస్తున్నాయి. ప్రేమసమాజం అన్నపూర్ణ ఆడిటోరియం వేదికగా.. అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంగా కళాభిమానులకు కనువిందు చేస్తున్నాయి.

సాయంత్రం వేళల్లో..

సాధారణంగా మనిషి తన నిత్య జీవితంలో సాయంత్రం వేళల్లో కొంత ఉపశమనం పొందుతుంటాడు. ఉదయం నుంచి పని ఒత్తిడి ఎదుర్కొంటూ.. ఉద్యోగం/పని నుంచి సాయంత్రం ఇంటికొచ్చిన ఆ వ్యక్తికి ఎంతో కొంత ఉపశమనం ఇచ్చేందుకు ఈ సంస్థలు తమ కళల ద్వారా ఉపశమనాన్ని ఇస్తున్నాయి.

వీకెండ్ వచ్చిందంటే చాలు..

వారంలో శని, ఆదివారాలు వచ్చాయంటే కళాభిమానులు.. వయో వృద్ధులకు ప్రేమసమాజం అన్నపూర్ణ ఆడిటోరియం, అల్లూరి విజ్ఞాన కేంద్రం మానసిక ఉల్లాసాన్ని నింపుతున్నాయి. వారం చివరిలో నిర్వహించే కార్యక్రమాలకు పెద్ద ఎత్తున కళాభిమానులు హాజరవుతున్నారు.



ప్రేక్షకులను ఉర్రూతలూగించిన నాటకం (ఫైల్)

అందరి శ్రేయస్సు కోరే..



అందరి శ్రేయస్సు కోరే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మనిషి తన నిత్య జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటాడు. మనిషి మానసిక ఉల్లాసానికి సంగీతం ఉదాహరణగా చెప్పొచ్చు. చాలా మంది పద్యనాటకాలు.. సురభి సంస్థచే నిర్వహించే నాటకాలు ఇష్టపడతారు. అటువంటి కార్యక్రమాలు చూడటం ద్వారా మనిషి ఎంతో కొంత ఉపశమనం పొందుతుంటాడు. ఎన్నో సాంస్కృతిక సంస్థలు.. ఎంతో మంది కళాకారులు వారి కళల ద్వారా కళాభిమానులను ఆకట్టుకుంటున్నారు. **– బాదంగీర్ సాయి**

పది మందిని సంతోష పెట్టాలి..



సంతోషం.. ఆనందం అనేవి ఏ ఒక్కరి కోసం కాదు. పది మందిని సంతోషపెట్టాలి. సంస్థ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 100కు పైగా కార్యక్రమాలు నిర్వహించాం. సెలబ్రిటీలు వాణిశ్రీ.. రమాప్రభను తీసుకొచ్చాం. త్వరలో మరింత మంది ప్రముఖ తారలను తీసుకు వస్తున్నాం. ఇక్కడే కాదు.. హైదరాబాద్‌లో కూడా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాం. ఇవన్నీ ఎవరి సహకారం లేకుండా.. నా సొంత డబ్బుతోనే నిర్వహిస్తున్నా.

– కందర్ప రాధ, రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థ అధ్యక్షురాలు

కుటుంబ సభ్యులందరూ కళాకారులే..



మా కుటుంబ సభ్యులందరూ కళాకారులే. తండ్రి రామారావు నాటకాలు వేసేవారు. తల్లి రాజేశ్వరి గాయకురాలు. బుర్రకథలు చెప్పేవారు. నలుగురు అన్నదమ్ములం. ఫణిభూషణరావు, శశిభూషణరావు, చంద్రభూషణ్, ఉమా భూషణ్. అంతా గాయకులే. పుట్టిన పిల్లలు కూడా కళాకారులే. సంస్థను 92లో ప్రారంభించాం. ఇప్పటి వరకు 5 వేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించాం. కళను పది మందికి పంచాలన్న ఉద్దేశంతోనే సంస్థను నడుపుతున్నాం.

– ఫణిభూషణావు, కళాకారుడు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

డాబాగార్డెన్స్ : రక్షా బంధన్‌తో అన్నా చెల్లెళ్ల అనుబంధం మరింత బలపడుతుందని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విశాఖలో ప్రతి ఏటా బ్రహ్మకుమారీ సంస్థ ద్వారా రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. రక్షా బంధన్‌తో అన్నా చెల్లెళ్ల అనుబంధం మరింత బలపడుతుందన్నారు. పూర్వ కాలంలోనే రక్షా బంధన్ పండగ మొదలైందన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి బీకే రామేశ్వరి మాట్లాడుతూ వ్యసనాలు, దురలవాట్లకు మానవులు బానిసలవుతున్నారని, ఇతరులను రక్షించలేని స్థితిలో ఉన్నారన్నారు. నవ్య ప్రపంచంలో మానవులకు జ్ఞానం అందించాల్సి ఉందన్నారు. పరమేశ్వరుడి స్వరూపం ఆలయాలు, సృష్టిలో ఉందన్నారు. ప్రకృతి ధర్మం అధిగమించరాదని సూచించారు. దేశంలో ఉత్తరాన రాఖీ పౌర్ణమి, దక్షిణంలో జంధ్యాల పౌర్ణమిగా జరుపుకుంటారని తెలిపారు. యుద్ధానికి వెళ్లే ముందు వీరులకు మహిళలు రక్షాబంధన్ కడతారని, ఆ పవిత్రత ద్వారానే భారత్ అగ్ర రాజ్యంగా అవతరిస్తుందన్నారు. కార్యక్రమంలో సింహాచలం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ గంట్ల శ్రీనుబాబు, నాగరాజు పట్నాయక్, బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు సిద్దూ, సునీత, సత్యవతి, అనురాధ, భవానీ, సుమ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీలో కూలిన పరిపాలన విభాగం



ట్రెజరీలో కూలిపోయిన ప్రదేశం

మహారాణిపేట : కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో కొంత భాగం కూలిపోయింది. శనివారం ఉదయం అకస్మాత్తుగా కొంత భాగం కూలిపోయింది. ట్రెజరీ పరిపాలన సెక్షన్‌లో కొంత భాగం పడిపోతుండడంతో ముందుగానే ఖాళీ చేయించారు. మేడ మీద ఉన్న ఈ భాగం ఎండకు ఎండి, వానకు తలసిపోవడంతో ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించారు. దీంతో ఆస్తి నష్టం సంభవించలేదని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు.

సాగరతీరంలో కొవ్వొత్తుల ర్యాలీ



సాగరతీరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, బీజేపీ నాయకులు

బీచ్‌రోడ్డు: కోల్‌కతాలోని ఆర్జే కర్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా బీజేపీ మహిళా మోర్చా, ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో శనివారం సాగరతీరంలో మౌన ప్రదర్శన, క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కాళీమాత టెంపుల్ నుంచి వైఎంసీఏ వరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ఎన్ని చట్టాలు చేసినా.. సమాజంలో మార్పు రావడం లేదని, ఇటువంటి వారికి బహిరంగంగా శిక్షపడేలా చట్టం చేయాలన్నారు. ఈ ఘటనపై న్యాయం జరిగే వరకూ దేశవ్యాప్తంగా నిరసన చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, మెడికల్ కాలేజ్ డాక్టర్ అప్పారావు, ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్, బీజేపీ మెడికల్ రాష్ట్ర కన్వీనర్ రవికుమార్, బీజేపీ కో కన్వీనర్ బెహరా రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై అత్యాచారం దారుణం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యులు

సీతమ్మధార : కోల్‌కతా వైద్యురాలి దారుణ హత్యకు నిరసనగా గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, వైద్యురాలిని హత్య చేయడం బాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యుడు డాక్టర్ రమేష్‌బాబు, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం జోషి, సుగుణేశ్వరి, జైభీమ్ కన్వీనర్ కోన ప్రకాష్, డాక్టర్ చలపతిరావు, గౌరవ అధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమౌళి

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భారతీయ సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చెప్పారు. మురళీనగర్ వాకర్స్ పార్కులోని క్లబ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన, శాస్త్రీయ, జానపద నృత్యాల్లో ప్రతిభావంతులతో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రజలకు వాటి ప్రాధాన్యతను తెలియజేస్తామన్నారు. ఈ నెల 25న ఉచిత నేత్ర వైద్య శిబిరం, 29న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, కవితా గోష్ఠి, సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం, వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, పి.చెల్వరాజు, జె.కూర్మారావు, ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్, ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

కుళాయి నీరు రాక ఇక్కట్లు



నీటిధార చిన్నగా వస్తున్న కుళాయి వద్ద మహిళలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో వారం రోజులుగా కుళాయి నీరు సరఫరా అరకొరగా వస్తోంది. దీంతో కాలనీ మహిళలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. తాగునీటికి వినియోగించే కుళాయి నీరు రాకపోవడంతో బయట నీటిని కొనుక్కొని తాగావాల్సి వస్తోందని వాపోతున్నారు. గొల్లవీధిలో కుళాయిల నుంచి చుక్క నీరు రావడం లేదని మహిళలు మండిపడుతున్నారు. ఈ వీధిలో నూతనంగా వేసిన ఓపెన్ పైప్‌లైన్ కనెక్షన్ కలిపే ప్రక్రియలో భాగంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అంటున్నారు. ఈ పైప్‌లైన్ ఎగువ ప్రాంతంలో ఉన్న పైప్‌లైన్‌కు అనుసంధానం చేశారు. దిగువ ప్రాంతంలో ఉన్న వీధి శివారు కుళాయిలకు అనుసంధానం చేయలేదు. దీంతో మూడు రోజులుగా పూర్తిగా నీరు సరఫరా జరగడం లేదని మహిళలు చెబుతున్నారు. సన్నని ధార వస్తున్న కొన్ని కుళాయిల వద్ద బారులు తీరుతున్నామని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చెట్టుకు రాఖీ కట్టిన చిన్నారులు



సంతపాలెం పాఠశాల ఆవరణలో చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

ఆరిలోవ: రాఖీ పండగ రాగానే ఆడ పిల్లలు ఇంట్లో అన్నయ్య, తమ్ముడికి రాఖీలు కట్టి సరదాగా గడుపుతారు. అన్నదమ్ములను ప్రేమించనట్లే కొందరు పిల్లలు పచ్చని చెట్లను కూడా ప్రేమించి ఎకో ఫ్రెండ్లీని చాటుతున్నారు. ఇందులో భాగంగా శనివారం 12వ వార్డు సంతపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఓ చెట్టుకు విద్యార్థులు రాఖీ కట్టి సోదర భావం చూపారు. వారిని ప్రధానోపాధ్యాయుడు సిరికి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. పర్యావరణంపై ప్రేమ చూపాలని పిల్లలకు సూచించారు.

వయనాడ్‌లో హిమా హ్యూమానిటేరియన్ సేవలు



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న హ్యూమానిటేరియన్ బృందం సభ్యులు

డాబాగార్డెన్స్ : సింహాద్రి టీఎంటీ, ఒరిస్సా స్టీవ్ డోర్స్, హిమా హ్యూమానిటేరియన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వయనాడ్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బాధితులకు మేమున్నామంటూ భరోసా కల్పించారు. నిత్యావసర సరకులు అందించారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన ఆయా సంస్థలు గత నెలలో వయనాడ్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన పంచిరిమట్టు, ముండక్కై, వెల్లరిమల తదితర ప్రాంతాల్లో వరద బాధితుల సహాయార్థం హిమా హ్యూమానిటేరియన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్, సహాయక కార్యదర్శి జీవీ హరి పర్యటించారు. పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న మెప్పాటి గ్రామ పంచాయతీ పునరావాస కేంద్రానికి రగ్గులు, లుంగీలు, చీరలు, టవళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా తమ వంతు సహాయం అందిస్తున్నామని బృందం ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 12న గాజువాక టీఎస్సార్ అండ్ టీబీకే కాలేజీ చైర్మన్ టి. బలరామకృష్ణ, కరస్పాండెంట్ టి. ఉమామహేశ్వరరావు, రిటైర్డ్ జడ్జి పైల సన్నిబాబు నేతృత్వంలో విశాఖ నుంచి వస్తువులతో వయనాడ్ బయలుదేరి వెళ్లామని టీవీడీ దాస్ తెలిపారు.

దేశంలో తీవ్రమైన నిరుద్యోగ సమస్య



మాట్లాడుతున్న ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సౌత్ సెంట్రల్ జోనల్ అధ్యక్షుడు సతీష్, పాల్గొన్న యూనియన్ సభ్యులు, విద్యార్థులు

డాబాగార్డెన్స్ : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమంలో భాగంగా 'భారతదేశం–నిరుద్యోగ సమస్య–కారణాలు–పరిష్కారం' అనే అంశంపై శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. యూనియన్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సౌత్ సెంట్రల్ జోనల్ అధ్యక్షుడు పి. సతీష్ మాట్లాడారు. భారతదేశంలో గత 46 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 9.2 శాతంగా నిరుద్యోగుల సంఖ్య ఉందని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. ఇదిలాగే కొనసాగితే మరో బంగ్లాదేశ్, శ్రీలంక, కెన్యా వంటి దేశాల్లో జరిగిన తిరుగుబాటు మన దేశంలో కూడా వస్తుందన్నారు. జీవిత బీమాను ప్రభుత్వ రంగంలోనే కొనసాగే విధంగా గత 30 ఏళ్లుగా అనేక సమ్మెలు చేస్తూ, వారి డిమాండ్లలో ఒకటిగా యువతకు ఉద్యోగ కల్పన కూడా భాగంగా చేసుకున్న ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ సదస్సు నిర్వహించడం స్ఫూర్తిదాయకమనామ్నరు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, కార్యదర్శి జి. వరప్రసాద్, విశ్రాంత లెక్చరర్ కె. పద్మ, ఎస్ఎఫ్ఐ నాయకుడు నాయుడు, డీవైఎఫ్ఐ నాయకుడు సంతోష్, అధిక సంఖ్యలో యూనియన్ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు మత్తు మందులు విక్రయిస్తే చర్యలకు సిఫారసు



గోడపత్రిక విడుదల చేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

జగదాంబ : పిల్లలకు మత్తు మందులు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సిఫారసు చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ హెచ్చరించారు. సూర్యాబాగ్‌లో గల జోన్–4 కార్యాలయంలో శనివారం కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. వైద్యులు రాసిన చీటీలు లేకుండా పిల్లలకు కోరెక్స్ వంటి దగ్గు మందులు, ఆల్ప్రా జోలం, బెంజోడియాజెపినిస్, డయాజెపం, ఆల్ప్రెక్స్, రెస్టిల్, ఇంకా మోర్ఫెయిన్, కోడైన్, ఫెంటాలైనేటిక్ ఇంజక్షన్ల అమ్మకం చట్టవిరుద్ధం అని గుర్తు చేశారు. వీటి విక్రయాలపై తమకు ఎన్నో ఫిర్యాదులు అందాయని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి మత్తుమందులు విక్రయించే మెడికల్ స్టోర్ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు కమిషన్ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ విజయకుమార్ మాట్లాడుతూ, మెడికల్ స్టోర్స్ ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తామని తెలిపారు. మత్తుమందులు విక్రయించని జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల సాయంతో కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జిల్లా ఔషధ నియంత్రణ శాఖ రూపొందించిన బాలల బంగారు భవితకు డ్రగ్స్ కంట్రోల్ శాఖ చేయూత పేరిట రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ పీడీ జయదేవి, జిల్లా బాలల సంరక్షణాధికారి లక్ష్మి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు మండ రజని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.శ్రీనివాసరావు (సేల్స్), వి.అభిప్రియారావు (మేన్యుఫ్యాక్చరింగ్), కె.కల్యాణి, 200 మంది వరకు మెడికల్ స్టోర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



సెల్ టవర్ ఏర్పాటు చేసిన ఇంటి ముందు స్థానిక మహిళలు



ఆదర్శనగర్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్

ఆరిలోవ: పాత డెయిరీఫారం ప్రాంతం ఆదర్శనగర్‌లోని ఓ ఇంటిపై సెల్ టవర్ ఏర్పాటు వివాదంగా మారింది. సెల్ టవర్ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ మాకొద్దంటూ వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ ఓ ఇంటిపైన ఎయిర్ టెల్ కంపెనీకి చెందిన సెల్ టవర్ ఏర్పాటు చేసుకోవడానికి ఇంటి యజమాని టవర్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో కొద్ది రోజులుగా టవర్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇంటిపైన సెల్ టవర్ ఏర్పాటు చేశారు. దానికి కేబుళ్లు ఆపరేటింగ్ సిస్టం అమర్చాల్సి ఉంది. దీంతో శనివారం స్థానికులు ఆ ఇంటి వద్దకు చేరుకుని సెల్ టవర్ నిర్మాణం పనులు నిలిపేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. సెల్ టవర్ వల్ల నివాసులు అనారోగ్యం పాలవుతామని, రేడియేషన్ సమస్యలకు గురవుతామన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు ఎక్కువగా దీని సమస్యతో అనారోగ్యానికి గురవుతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ టవర్ ఇక్కడ ఏర్పాటు చేయవద్దంటూ నినాదాలు చేశారు. పనులు వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానికులం అంతా కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.